క్లుప్తంగా

నేటినుంచి ఆలయ వార్షికోత్సవం

ఆమదాలవలస: మండలంలో వంజంగి గ్రామంలో గల ముకుంద తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ 13వ వార్షికోత్సవాన్ని సోమవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం స్వామివారికి క్షీరాభిషేకం, అఖండ దీపారాధన, మండప ఆరాధన, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మంగళవారం వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. బుధవారం స్వామివారి చక్రతీర్థస్నానాలు, పూర్ణాహుతి, ఇతర పూజలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకోండి

సారవకోట: వరి విత్తనాల కావల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి కె.సి.హెచ్.వెంకటరావు సూచించారు. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల్లో బీపీటీ 5204, ఎంటీయూ 7029, ఎంటీయూ 1224, ఎంటీయూ 1061, ఆర్‌జీసీ 2537, ఎంటీయూ 1064, ఎంటీయూ 1318, ఎంటీయూ 1121 రకాల వరి విత్తనాలు ఉన్నాయన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం: పాతపట్నం ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతుల్లో మిగిలి ఉన్న ఖాళీ సీట్లను రిజర్వేషన్ ప్రకారం భర్తీ చేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రత్న కుమారి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీలోగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూప్‌లలో ఎంపికైన విద్యార్థులు తగిన ధ్రువపత్రాలతో అడ్మిషన్ పొందాలన్నారు. పూర్తి వివరాలకు పాఠశాల ఆఫీస్‌లో సంప్రదించాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


వైద్యాధికారి రాజేష్

బూర్జ: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి.రాజేష్ అన్నారు. మండలంలోని బూర్జ, మదనాపురం, పెద్దపేట, పాలవలస, లక్కుపురం గ్రామాలలో ఆదివారం పర్యటించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. వర్షాలు పడుతున్నందున గ్రామాలలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వైద్య సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

రహదారిలో దిగబడిన లారీ


లారీని బయటకు తీస్తున్న జేసీబీ

సరుబుజ్జిలి: మండల కేంద్రానికి సమీపంలోని పోలీస్ స్టేషన్ వద్ద ఆర్‌అండ్‌బీ రహదారిలో భారీ లోడుతో వెళ్తున్న లారీ ఆదివారం దిగబడిపోయింది. బస్సులు, ఇతర వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే స్థానిక ఎస్సై నిహార్ స్పందించి జేసీబీలను తెప్పించి గోతులో దిగబడిన లారీని బయటకు తీశారు.

రోడ్డుకు అడ్డంగా వాహనాల నిలుపుదల


మడపాం టోల్‌గేట్ ముందు నిలిపిన వాహనాలు

నరసన్నపేట: జాతీయ రహదారిపై మడపాం టోల్‌గేట్ వద్ద వాహనాలు అడ్డదిడ్డంగా నిలపడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతుంది. టోల్‌గేట్ దాటిన తరువాత, ముందు ఒకేలా వాహనాలు నిలుపుతున్నారు. దీంతో వచ్చిపోయే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహనదారుల కష్టాలు అయితే వర్ణణాతీతం. ఏ వాహనం ఎలా వచ్చి ఢీకొంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. వెళ్లేందుకు సరైన మార్గం కూడా ఉండటం లేదు. పోలీసులు స్పందించి వాహనాలు క్రమ పద్ధతిలో నిలిపేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు, స్థానికులు కోరుతున్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

ఎల్.ఎన్.పేట: ఖరీఫ్ వరిసాగు కోసం ప్రభుత్వం నుంచి సరఫరా చేస్తున్న విత్తనాలకు నగదు చెల్లించి పేర్లు నమోదు చేసుకున్న రైతులకు విత్తనాలు సరఫరా చేయటం జరుగుతుందని ఏఓ పైడి లతశ్రీ అన్నారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు విత్తనాలు కావాలసిన రైతుల పేర్లు నమోదు చేస్తున్నారన్నారు. రైతులకు అందుబాటులో మారుటేరు సాంబ (ఎంటీయూ 1224), సాంబ మసూరి, శ్రీకాకుళం సన్నాలు, సోనామసూరి, 1064 అమర, 1318 తదితర రకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆయా విత్తనాలకు సంబంధించిన నగదు చెల్లించిన రైతులకు విత్తనాలు ఆర్బీకేల ద్వారా సరఫరా చేయటం జరుగుతుందన్నారు. రైతులు ఆర్బీకేలకు వెళ్లి సిబ్బంది వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

రోడ్డు పక్కనే చెత్త కుప్పలు



సారవకోట మండలంలోని పలు చోట్ల జాతీయ రహదారి పక్కనే చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. నరసన్నపేట నుంచి పాతపట్నం వెళ్లే జాతీయ రహదారికి పక్కనే వెంకటాపురం, సారవకోట, అలుదు, బురుజువాడ గ్రామాలలో ఈ చెత్త కుప్పలు అధికంగా కనిపిస్తున్నాయి. ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారు. కొన్నిచోట్ల ఈ చెత్త కుప్పలను మండిస్తుండటంతో పొగ రావడంతో ఈ మార్గంలో వెళ్లే ప్రయాణీకులు మరిన్ని అవస్థలు పడుతున్నారు.

– సారవకోట

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



భూసారాన్ని పెంచేందుకు ఎంతగానో ఉపయోగపడే పచ్చిరొట్ట విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేయటం జరుగుతుందని ఎల్.ఎన్.పేట: ఏఓ పైడి లతశ్రీ తెలిపారు. ఆదివారం ఎల్.ఎన్.పేట మండలంలోని పలు ఆర్బీకేల ద్వారా విత్తనాలు పంపిణీ చేశామని తెలిపారు. జీలుగు, కట్లజనుము రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 50 శాతం ప్రభుత్వ రాయితీ పోను ప్యాకెట్ ధర రూ.440 విక్రయిస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

– ఎల్.ఎన్.పేట

పోటెత్తిన భక్తులు



ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, పాతపట్నం గ్రామదేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయంలో వైశాఖమాసం ఆదివారం కావడంతో భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి ఆలయానికి తెల్లవారు జామునుంచే స్థానికులతోపాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఘటాలతో మొక్కులు చెల్లించారు. పలువురు వాహన పూజలు కూడా చేశారు.

– పాతపట్నం

సాగునీరు అందేనా!

- అడుగంటిన వెన్నెలవలస రిజర్వాయర్
- ఆయకట్టు రైతుల ఆందోళన

సరుబుజ్జిలి: ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఆ మేరకు కాలువలు, రిజర్వాయర్లు సిద్ధంగా లేవు. మండలంలోని వెన్నెలవల వద్ద 1991లో అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి హయాంలో రూ.64కోట్లతో నాలుగు హెక్టార్ల విస్తీర్ణంలో దాదాపు 467 ఎకరాలు ఆయకట్టుకు నీరు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేశారు. ఎగువ ప్రాంతాల్లో ఉన్న కొండల్లో కురిసిన వర్షం నీటిని నిల్వ చేసి పంట అవసరాలకు వినియోగించుకునేందుకు నిర్మించారు.

శిథిలమైన కల్వర్ట్‌లు..

476 ఎకరాలకు సంబంధించి ఎగువ వెన్నెవలవలస, దిగువ వెన్నెవలస, చిగురువలస, తాడికొండ, కొంద్రగూడ, శ్రీరాంవలస, లక్ష్మీపురం తదితర రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్న భూములకు సాగు నీరందించాల్సిన కాలువ కల్వర్ట్‌లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. రబీ, ఖరీఫ్ సీజన్ల సమయంలో రైతులు సాగునీరు అందక చుక్క నీటికోసం నానా కష్టాలు పడుతున్నారు.


రిజర్వాయర్‌లో అడుగంటిన నీరు

పూడికపోయిన రిజర్వాయర్..

రిజర్వాయర్‌లో భారీగా పూడిక పేరుకుపోయింది. ఏళ్ల తరబడి పిచ్చిమొక్కలు, పూడిక తొలగించకపోవడం వల్ల సుమారు 10 అడుగులు ఉండాల్సిన రిజర్వాయర్ లోతు మైదానాన్ని తలపిస్తుంది. రిజర్వాయర్ గట్టు, మదుములు పూర్తిగా శిథిలం కావడంతో ఏమాత్రం వర్షం నీరు చేరినా రిజర్వాయర్‌లో నిల్వ చేయడానికి వీలుకుదరడం లేదు.


శిథిలమైన మదుములు

పూడికతీయాలి



ఏళ్ల తరబడి రిజర్వాయర్‌లో పూడికతీత పనులు చేయకపోవడం వల్ల చుక్కనీరు నిల్వ ఉండడంలేదు. పలు మార్లు నీటి కొరతపై అధికారులకు అందించిన వినతులు బుట్టదాఖలు చేశారే తప్ప.. పరిష్కరించలేదు.

– సి.హెచ్.ఎర్రయ్య, రైతు

మరమ్మతులు చేయాలి



మదుములు, గట్టు పూర్తిగా పాడయ్యాయి. నీరు కింద స్థాయి భూములకు అందడంలేదు. కాలువలు పూర్తిగా పూడికపోయాయి. గతంలో చేపట్టిన నీరు–చెట్టు పనులు రైతులకు ఎటువంటి ప్రయోజనం చేకూర్చలేదు. అధికారులు దృష్టి సారించాలి.

–పున్నపురెడ్డి తవిటినాయుడు, రైతు

పరిశీలన చేస్తాం

రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గడం వల్ల కింది స్థాయి భూములకు ఇబ్బందులు ఉన్నమాట వాస్తవమే. ఖరీఫ్ ప్రారంభానికి ముందే కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగించి సాగునీటి ఇబ్బందులు లేకుండా చేస్తాం.

– పి.మధు, జేఈ, నీటిపారుదలశాఖ

నైతిక విలువల విద్య అవసరం

ఆమదాలవలస: నేటి ఆధునిక యుగంలో లౌకిక విద్యతోపాటు నైతిక విలువున్న విద్య విద్యార్థులకు ఎంతో అవసరమని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ విద్యాజ్యోతి ఇన్‌చార్జ్ ఎస్.వి.గురుప్రసాద్ అన్నారు. పట్టణంలో గల లక్ష్మీనగర్ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కంప్యూటర్ శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వేసవి సెలవులు నేపథ్యంలో 40 రోజులపాటు కంప్యూటర్ శిక్షణ పూర్తిచేసిన 42 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కంప్యూటర్ శిక్షణ విద్యార్థులకు రానున్న రోజుల్లో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జోనల్ కన్వీనర్ ఎం.జనార్దనరావు, జిల్లా గ్రామ సేవా ఇన్‌చార్జి ఎం.రవీంద్రబాబు, భజన మండలి కన్వీనర్ చిన్నబాబు, ఎస్.వాసుదేవరావు, దామోదర్ పట్నాయక్, బండి ప్రతిమ పాల్గొన్నారు.


సర్టిఫికెట్లను అందజేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

టీడీపీ, బీజేపీ నాయకుల సంబరాలు


మెళియాపుట్టి: మూడు రోడ్ల కూడలిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు


హిరమండలం: కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు

మెళియాపుట్టి: శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు కేంద్ర మంత్రి వర్గంలో చోటు దక్కడంపై మండలానికి చెందిన కూటమి నాయకులు సంబరాలు చేసుకున్నారు. మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలిలో ఆదివారం కేక్ కత్తిరించి మిఠాయిలు పంచిపెట్టారు. పలువురు నాయకులు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాతో పాటు పాతపట్నం నియోజకవర్గం అభివృద్ధిలో ముందుకెళ్తుందని తెలిపారు.

హిరమండలం: కేంద్రంలో నరేంద్ర మోదీ మూడో సారి ప్రధానమంత్రిగా ఆదివారం ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు బోయిన ధర్మారావు ఆధ్వర్యంలో, శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు కేంద్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా టీడీపీ నాయకుడు, జెడ్పీటీసీ సభ్యుడు పాగిరి బుచ్చిబాబు ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. బాణసంచా కాల్చారు.

వరి వెదలు వేసేందుకు సిద్ధం


కలిగాం వద్ద వరి వెద వేసేందుకు సిద్ధం చేసిన పొలం

కొత్తూరు: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వరి వెదలు వేసేందుకు రైతులు తమ పొలాలను దుక్కిలు చేసి సిద్ధంగా ఉంచారు. పదునైన వర్షాలు కురిసిన వెంటనే వరి విత్తనాలు వేయనున్నారు. దుక్కులతోపాటు మేక, గొర్రెల మందలు, గత్తం వేశారు. మండలంలో ఐదు వేల హెక్టార్లలో వరి సాగు చేస్తుండగా అందులో సుమారు మూడు వేల హెక్టర్లలో వరి వెదలు చల్లనున్నారు. వర్షాభావం కారణంగా రైతులు వెదలు వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రతీ గ్రామంలో దమ్ములు కంటే వెదలు వేయడం ఎక్కువ చేస్తున్నారు. ఈ ఏడాది మండలంలో మరింత ఎక్కువ విస్తీర్ణంలో వరి వెదలు వేసేందుకు రైతులు తమ పొలాలను దుక్కులు చేసుకొని పనులు పూర్తిచేశారు.

వెదలు చల్లడం వల్ల ఉడుపులు, ఆకు తీత, దమ్ములు చేయడంతో పాటు పలు రకాల పనులకు పెట్టుబడి అవసరం లేకపోవడంతోపాటు తక్కువ పెట్టుబడితో సాగు చేయడం జరుగుతుంది. నాట్లు వేసిన వరి చేను కంటే వెద చేనుకి వర్షం తక్కువ శాతం కురిసినా పంట చేతికి అందుతుందన్న నమ్మకంతో రైతులు వెదలు వైపు మొగ్గు చూపుతున్నారు.

సత్యసాయి సేవలు విస్తరించాలి


సత్యసాయి బోధనలు వినిపిస్తున్న దృశ్యం

ఎల్.ఎన్.పేట: భగవాన్ సత్యసాయి సేవలను ప్రతి గ్రామానికీ విస్తరింప జేయాలని భగవాన్ సత్యాసాయి భజన మండలి కన్వీనర్ ఎ.నారాయణరావు అన్నారు. మండలంలోని శ్యామలాపురం గ్రామంలో సత్యసాయి బోధనలు వినిపించారు. అన్ని గ్రామాల్లోనూ సేవా కార్యక్రమాలను చేపట్టాలని సత్యాసాయి కమిటీ సభ్యులకు సూచించారు.

వైభవంగా మద్వేంకటనాయక స్వామి మహోత్సవం


స్వామివారి తీరువీధిలో భక్తజనం


పూజలందుకున్న స్వామివారు

గార: మండల కేంద్రం గారలోని మద్వేంకటనాయక స్వామి ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి విశ్వక్షేన ఆరాధనతో ప్రారంభమైన కార్యక్రమం 108 లీటర్ల ఆవుపాలతో స్వామివారికి అభిషేకం, అనంతరం నిజరూప దర్శనం, హోమాలు, శ్రీవారి అలంకరణ మహోత్సవం, అన్నసమారాధన జరిగింది. సాయంత్రం స్వామి ఉత్సవమూర్తులను గార పుర వీధుల్లో అధిక సంఖ్యలో భక్తులు వెంటరాగా తిరువీధి ఉత్సవాన్ని ఘనంగా జరిపారు. మేళతాళాలు, భజనలు, గోవిందనామ స్మరణతో గ్రామమంతటా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయ అర్చకులు జాడ సునిల్‌శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కింతలి కృష్ణారావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేరండి

పాతపట్నం: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని, విద్యార్థులర ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సనపల వైకుంఠరావు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉపాధ్యాయులతో కలిసి మండలంలోని ప్రహరాజపాలెం, సీతారాంపల్లి, గోపాలపురం, బూరగాం తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. పాఠశాలలో పదో తరగతిలో విద్యార్థులు సాధించిన ఫలితాలు, మౌలిక సదుపాయాలు గూర్చి తల్లిదండ్రులకు వివరించారు. సకల సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఉపాధ్యాయులు ఎస్.టి.రామారావు, కోటేశ్వరరావు, కల్యాణరాజు, జగన్, పాల్గొన్నారు.


ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

లయన్స్ సేవలు విస్తృతం చేస్తాం

నరసన్నపేట: మండల పరిధిలో లయన్స్ క్లబ్ సేవలు మరింతగా విస్తృత పరుస్తామని క్లబ్ అధ్యక్షుడు సదాశివుని కృష్ణ అన్నారు. నరసన్నపేటలో ఆదివారం క్లబ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో శాశ్వత స్థాయిలో క్లబ్ సేవలు విస్తృత పరుస్తామని హామీ నిచ్చారు. ఇప్పటికే చేపట్టిన సేవా కార్యక్రమాల నివేదికను కార్యదర్శి నాగరాజు అందించారు. రానున్న సంవత్సరానికి అధ్యక్షుడిగా రమణసాహు, కార్యదర్శిగా కె.సాయిరాంను ఎన్నుకున్నట్లు కృష్ణ తెలిపారు. కొత్త కార్యవర్గం జూలై నుంచి బాధ్యతలు స్వీకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు బోయిన బాలకృష్ణ, ఊణ్న రంగనాథ్, సాయిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సదాశివుని కృష్ణ

అపూర్వ కలయిక

మండల కేంద్రం గారలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990–95 విద్యా సంవత్సరాల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థులంతా ఒక చోట కలుసుకున్నారు. ఆదివారం సమీప శాలిహుండం వేణుగోపాలస్వామి ఆలయం వద్ద కుటుంబ సభ్యులు, అప్పటి గురువులతో కలిసి రోజంతా గడిపారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులు బి.వాసుదేవరావు, బి.మోహనరావు, గోవిందరావును ఘనంగా సత్కరించి గౌరవించారు.

–గార



కూర్మనాథ ఆలయానికి పోటెత్తిన భక్తజనం


క్యూలైన్‌లో ఉన్న భక్తులు

గార: శ్రీకూర్మనాథాలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూరం నుంచి వచ్చిన భక్తులు ముందుగా మూలవిరాట్‌ను దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం లక్ష్మీదేవాలయం, వైష్ణవీదుర్గ, తాబేళ్లపార్కును సందర్శించారు. దేవస్థానంలో జరిగే నిత్యాన్నదానంలో 300 భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులు రెండు క్యూలైన్ల ద్వారా స్వామిని దర్శించుకున్నారు. దేవస్థాన సిబ్బంది భక్తులకు అసౌకర్యం కలగకుండా చూశారు.